ఈనాడు
పెద్దపల్లి
శనివారం అక్టోబరు 12, 2024

అధికార యంత్రాంగం.. సర్వేలో నిమగ్నం

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ప్రతి కుటుంబానికి యూనిక్ సంఖ్యతో స్మార్ట్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి రెండు ప్రాంతాలను ఎంపిక చేశారు. జిల్లాలో మున్సిపాలిటీల్లోని మూడు వార్డులు, పంచాయతీల్లో మూడు వార్డుల్లో ఇంటింటికి వెళ్లిన సర్వే బృందాలు.. కుటుంబాల్లోని సమగ్ర సమాచారాన్ని సేకరించారు. మూడు రోజులుగా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. కంప్యూటీకరణ పనులను పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించే పనిలో నిమగ్నమయ్యారు.

పెరిగిన గృహాలు

జిల్లాలో ఆరు వార్డుల్లో ప్రభుత్వ లెక్కల ప్రచారం 1,127 గృహాలు ఉండగా 2,042 గృహాలు ఉన్నట్లు సర్వేలో తేలింది. బంధువుల ఇళ్లకు వెళ్లడం, అందుబాటులో లేనివారి ఇళ్లకు మరోసారి వెళ్లారు. నిర్దేశిత సమాచారంలోని వివరాలు తప్పులుంటే నిర్ధారించుకొని వాటిని ఫారం-1లో నమోదు చేశారు. పిల్లలకు పెళ్లిళ్లు కావడం, ఇప్పటి వరకు రేషన్‌కార్డు లేకపోవడం తదితర కారణాలతో ఉన్న వారిని ఫారం-2లో నమోదు చేస్తున్నారు. రామగుండం నియోజకవర్గంలో పాలకుర్తి మండలం గుడిపల్లిలో 210, రామగుండం మున్సిపాలిటీలోని 48వ వార్డులో 870, ముత్తారం మండలం దరియాపూర్‌లో 150, మంథని మున్సిపాలిటీ 13వ వార్డులో 379, పెద్దపల్లిలో సుల్తానాబాద్ మండలం దుబ్బపేట 212, పెద్దపల్లి మున్సిపాలిటీ 24 వార్డులో 321 గృహాలున్నాయి.


మంథని మున్సిపాలిటీలో నమోదు చేస్తున్న ఆపరేటర్

కుటుంబ యజమానిగా మహిళ

ఇంటింటి డిజిటల్ సర్వేలో కుటుంబ యజమానికిగా మహిళను తీసుకున్నారు. ఆధార్ కార్డు, చరవాణి, పుట్టిన తేదీ, కుటుంబ సభ్యులు, వారి బంధుత్వాన్ని పొందుపరుస్తున్నారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఫొటో చిత్రీకరించారు. సర్వేలో తప్పిదాలకు అవకాశం లేకుండా నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించారు. ఆన్‌లైన్ డాటా ఎంట్రీలో పొరపాట్లకు తావులేకుండా అనుభవం ఉన్న ఆపరేటర్లను నియమించారు. ఇప్పటి వరకు సగానికి పైగా ఆన్‌లైన్‌లో నమోదు పూర్తయింది. ఈ సర్వే నివేదికల ఆధారంగా మిగిలిన వార్డులు, గ్రామాల్లో సర్వే చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ఆన్‌లైన్‌లో వేగం పెంచాం

- అరుణశ్రీ, అదనపు పాలనాధికారి

జిల్లాలో ప్రయోగాత్మకంగా ఎంపికైన ప్రాంతాల్లోని సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నాం. తప్పులు లేకుండా సర్వే జాబితా సిద్ధమవుతోంది. ఆన్‌లైన్ నమోదులో వేగం పెంచుతున్నాం.

గురుకులాలు.. సమకూరే సదుపాయాలు

మంథని, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమీకృత గురుకుల పాఠశాలలను సకల సదుపాయాలతో నిర్మించనున్నారు. మంథని మండలంలోని అడవి సోమన్‌పల్లిలో నిర్మించనున్న భవనంలో అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ భవనాలు, వసతి గృహం, సిబ్బంది నివాసాలు, డైనింగ్ హాల్, ప్రత్యేక వంటగది, మల్టీపుల్ హాల్, మెరుగైన నీటి వసతి విధానం, శానిటేషన్, అధునాతన ఫర్నీచర్, అగ్నిప్రమాద నివారణ ఏర్పాట్లు చేపట్టనున్నారు. సోలార్ ఎనర్జీ, కంప్యూటర్ ల్యాబ్, విద్యుత్తు నియంత్రికలు, మోటార్లు, అంతర్గత రోడ్లు, పాఠశాలకు వచ్చేందుకు వీలుగా ప్రత్యేక రహదారి, పార్కింగ్, గార్డెన్, క్రీడా మైదానం వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. దాదాపు 2,500 మంది విద్యార్థులతోపాటు బోధన, బోధనేతర సిబ్బందికి అనుకూలంగా ఉండేలా ఏర్పాట్లు ఉండనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలి

జ్యోతినగర్ (మార్కండేయ కాలనీ), న్యూస్‌టుడే: ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్లాంటును దక్షిణ ప్రాంత రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమ్‌ప్రకాష్ శుక్రవారం సందర్శించారు. అలాగే సీఐఎస్ ఎఫ్-బీ టైప్ క్వార్టర్స్‌ను ఎన్టీపీసీ ఈడీ కేదార్‌రంజన్‌పాండు సమక్షంలో పరిశీలించారు. అనంతరం ఎన్టీపీసీ పర్మినెంట్‌టౌన్‌షిప్‌లో అధికారులు, ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ అభివృద్ధి కోసం అందరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. 40 ఏళ్ల కార్యాచరణను సాధించినందుకుగాను ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పీటీఎస్‌లో మొక్కలను నాటి నీళ్లు పోశారు. జీఎంలు, హెచ్‌వోహెచ్‌ఆర్, డీఎంఎస్ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.


ఎన్టీపీసీ ఈడీ, ఇతర అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఈడీ ప్రేమ్‌ప్రకాష్

ఏర్పాట్లు వేగంగా పూర్తిచేయండి

గోదావరిఖని: దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ శుక్రవారం పరిశీలించారు. సింగరేణి క్రీడా మైదానంలో జరగబోయే వేడుకలకు సంబంధించి.. జరుగుతున్న ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జీఎం లలిత్ కుమార్, అధికారులతో మాట్లాడారు.

రూ.లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు



ప్రారంభానికి నోచుకోని మినీ ఆడిటోరియం


సుల్తానాబాద్ ఏఎంసీలో నిరుపయోగంగా శీతల గిడ్డంగి

ఇది సుల్తానాబాద్ మార్కండేయకాలనీ సమీపంలో రూర్బన్ నిధులు రూ.కోటితో నిర్మించిన మినీ ఆడిటోరియం. ఏడాది గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో భవనం నిరుపయోగంగా ఉంది. పేదలు శుభకార్యాలు, పలు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఈ భవనం నిర్మించినా.. అందుబాటులోకి తేకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రూర్బన్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన శీతల గిడ్డంగులు ఇవి. రెండేళ్ల క్రితమే ప్రారంభించినా.. సామర్థ్యానికి తగిన విద్యుత్తు నియంత్రిక లేక నిరుపయోగంగా మారింది. దీంతో చిరువ్యాపారులు ప్రైవేటు గిడ్డంగులను ఆశ్రయిస్తున్నారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా భవనాలను పూర్తిచేసి ఆయాశాఖలకు అప్పగించినట్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, సుల్తానాబాద్

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

పాలకుర్తి(రామగుండం): పట్టణంలోని తబితా ఆశ్రమంలో మహిళా సాధికారత కేంద్రం, ఐసీపీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

కేంద్ర బృంద సభ్యుల పర్యటన

ఎలిగేడు (సుల్తానాబాద్), న్యూస్‌టుడే: ఎలిగేడు, లాలపల్లి గ్రామాల్లో ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కేంద్ర బృంద సభ్యులు శుక్రవారం పర్యటించారు. స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా గ్రామాల్లో తిరుగుతూ నిల్వ నీటి తొలగింపు, దోమల నివారణకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు శ్రీనివాస్, హరిదాస్, లక్ష్మణ్, మండల వైద్యాధికారిణి నిస్సి క్రిస్టినా, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర సర్కారు పెద్దపీట

కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమం, సింగరేణి సంస్థ అభివృద్ధికి రాష్ట్ర సర్కారు పెద్దపీట వేస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సంస్థ ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్తు ప్రణాళికలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ యాజమాన్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సందేశాలను వీడియో ద్వారా అందించారు. ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1, 2, సీహెచ్‌పీ, కమ్యూనిటీహాల్ ఉద్యోగులకు అవగాహన నిర్వహించగా ఓసీపీ-2లో నిర్వహించిన సామూహిక విందు భోజనాల కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. లాభాల వాటా ఉద్యోగులకు పంచామని.. భవిష్యత్తులో సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆర్జీ-3 జీఎం సుధాకరరావు మాట్లాడుతూ గతేడాది సమష్టి కృషితో లక్ష్యాన్ని సాధించినందుకు ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వైవీరావు, కోట రవీందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఇన్‌ఛార్జి ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, ఐఈడీ డీజీఎం చంద్రశేఖర్, మేనేజర్ రామారావు, ప్రాజెక్టు ఇంజినీరు నాగరాజు, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం పాల్గొన్నారు.


ఓసీపీ-2లో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉండొద్దు

మంథని, న్యూస్‌టుడే: రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని మంత్రి శ్రీధర్‌బాబు కలెక్టర్‌ను, సింగిల్ విండో అధ్యక్షులను ఆదేశించారు. అడవి సోమన్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. హమాలీ, గన్నీ సంచులు, తరుగు, రవాణా, టార్పాలిన్లు, సిబ్బంది కొరత తదితర సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బు చెల్లించేలా చూడాలన్నారు.

దశ తిరగాలి.. విజయం అందాలి..



సంకల్పమే ఆయుధంగా ముందుకు సాగాలి

ఈనాడు, కరీంనగర్

దసరా పండుగ.. విజయానికి ప్రతీక.. ఆత్మవిశ్వాసమే ఆయుధపూజగా విజయ మార్గంలో నడిచేవారికి.. శక్తియుక్తులను కూడగట్టుకుని లక్ష్యం దిశగా అడుగులు వేసేవారికి.. ఏదైనా పనికి శ్రీకారం చుట్టడానికి ఈ పండుగను మించిన మంచి రోజు మరొకటి ఉండదు. ఇదే రోజున శమీ వృక్షాన్ని పూజించిన రాముడు రావణుడిపై గెలిచాడు. దుర్గాదేవి మహిషాసురుడిని యుద్ధంలో ఓడించింది. పాండవులు జమ్మిచెట్టుపై నుంచి ఆయుధాల్ని దింపి వాటితో పోరాటానికి వెళ్లి విజేతలుగా నిలిచారు. ఇదే ఆశతో ఆకాంక్షతో ఉమ్మడి జిల్లావాసులు విజయపథాన నడిచేందుకు సిద్ధమవ్వాలి.. మది నిండుగా శక్తిని నింపుకొని.. సంకల్పాన్ని కూడగట్టుకుని గెలుపు తీరానికి చేరుకోవాలి..

రైతన్నా భిన్నంగా సాగు..



వానాకాలం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6.82 లక్షల మంది అన్నదాతలు దాదాపుగా 10లక్షలకుపైగా ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఇందులో అధిక శాతం వరి పంటే వేశారు. ఇక్కడి భూములు కూరగాయలు, వాణిజ్య పంటల సాగుకు అనుకూలమైనా వరిపైనే ఆధారపడుతున్నారు. విజయ దశమి తరువాత యాసంగి సాగు ప్రారంభమవుతుంది. ఇప్పుడైనా కొత్త పంటలు, కొత్త విధానాలను సాగులో తీసుకొస్తే అటు రైతన్నకు.. ఇటు ప్రజలకు మేలు జరుగుతుంది. కూరగాయల సాగు తగ్గి దిగుమతులపై ఆధారపడటం వల్ల ధరలు పెరిగి సామాన్యులకు అందడం లేదు. అధికారులు ఉమ్మడి జిల్లాలో ఏ పంటలు సాగు తగ్గడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.. వాటి సాగు వల్ల కలిగే మేలుపై అవగాహన కల్పిస్తే రైతులకు, ఉమ్మడి జిల్లావాసులకు ఉపయోగపడుతుంది. ఈ క్రమంలో మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరచడం అవసరం.

నైపుణ్య ప్రాప్తిరస్తు

యంగ్ ఇండియా, నైపుణ్యాభివృద్ధిని యువతకు అందించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలు అందిపుచ్చుకోవాలి. 'యంగ్ ఇండియా'లో భాగంగా సమీకృత గురుకులాలను ఒక రోజు ముందే మంథని, మానకొండూరు నియోజకవర్గాల్లో ప్రారంభించడం శుభ పరిణామం. త్వరలోనే జిల్లాకో కొత్త నైపుణ్య శిక్షణ కేంద్రం, టాస్క్ కేంద్రాలు, ఐటీఐలు ఏర్పాటవనుండటం యువత భవితకు మంచి రోజులనే సంకేతాలిస్తున్నాయి. 38 లక్షల జనాభాలో ఇంటర్ ఆపై విద్యార్హతలున్న వారు దాదాపుగా 3.50లక్షల వరకుంటారు. ప్రస్తుతం ఎంత చదివామన్నది కాదు.. ఎన్ని నైపుణ్యాలున్నాయన్నది ముఖ్యమని యువత గుర్తుంచుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను ఉపయోగించుకోవడంతోపాటు తాము సొంతంగా ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవడంపై దృష్టి పెడితేనే ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా ఎదగగలమన్న విషయాన్ని గుర్తించాలి. స్వయం ఉపాధితో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడంపై యువత దృష్టి పెట్టినప్పుడే నిరుద్యోగ సమస్య దూరమవుతుంది.



రేపటి తరానికి దిక్సూచిలుగా నిలిచేలా..

ఎన్నో ఏళ్ల కష్టం ఫలించింది.. దసరా తరవాత ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 800 మందికిపైగా ఉపాధ్యాయులు బడుల్లో అడుగు పెట్టనున్నారు. కలల కొలువు సాధించిన వీరు రేపటి తరానికి దిక్సూచిలుగా నిలిచేలా సాగాలి. మంచి బోధనతోపాటు నైతిక విలువలు నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే క్రతువు ప్రారంభించాలి. మరోవైపు పోలీసు శిక్షణను పూర్తిచేసుకున్న వారు కొందరు జిల్లాలో అడుగు పెట్టగా.. ఇంకొందరూ ఈ పండుగ తరువాత కొత్త కొలువుల్లో కొలువుదీరనున్నారు. సామాన్యులకు న్యాయం చేయడమే ప్రతి పోలీసు లక్ష్యమైతేనే ఆ దుస్తులకు సార్థకత లభిస్తుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.



మహిళా వికాసం..

42వేలకుపైగా స్వయం సహాయక సంఘాల్లోని 5.86 లక్షల మంది మహిళామణులను స్వయం ఉపాధిలో రాణించేలా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోంది. ఆ అవకాశాలను ఒడిసిపట్టుకుని విజయం దిశగా సాగాలి. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల రుణాల సహకారం ఆర్థికాభివృద్ధికి దోహదపడాలి. మహిళా శక్తి ద్వారా భిన్న వ్యాపారాలు స్థాపించి స్వయం ఉపాధి పొందాలి. 61 మండలాల్లో ఒక్కో మహిళా సంఘానికి అద్దె బస్సు నిర్వహణ బాధ్యతను అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ముమ్ముందు ఆర్థిక స్వావలంబన దిశగా రెట్టింపు ఉత్సాహంతో అతివలు అడుగేయడానికి దసరా వేదిక కావాలి.



కలల కొలువు సాధించండి

ఈ నెలలో నిర్వహించే గ్రూప్-1 మెయిన్ పరీక్షల్లో విజయం సాధించే దిశగా నాలుగు జిల్లాల్లో దాదాపుగా 4-5 వేల మంది రోజూ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. గ్రూప్స్ పోటీ పరీక్షలతోపాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలను దాదాపుగా 1.24 లక్షల మంది రాశారు. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను ఈ ఏడాదిలోనే దాదాపుగా 55 వేల మంది రాయబోతున్నారు. పోలీసు కానిస్టేబుళ్ల నియామకం కోసం కుర్రకారు సిద్ధమవుతున్నారు. విజయ దశమి స్ఫూర్తిగా ఇష్టంగా కష్టపడితే కలల కొలువు సాధించడం పెద్ద కష్టమేం కాదని గుర్తించండి.



విద్యకు అధిక ప్రాధాన్యం : దుద్దిళ్ల



పాఠశాల భవన శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని.. ప్రతీ విద్యార్థి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మంథని మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామంలో 25 ఎకరాల్లో రూ.300 కోట్లతో నిర్మించనున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్'కు ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ గురుకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. వచ్చే నెల నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. సమీకృత పాఠశాలల్లో కులమత భేదాలు ఉండవని.. అందరికీ సమానంగా విద్య అందించాలనే భావనతో రాష్ట్రంలో ఒకేసారి 28 పాఠశాలలకు శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు. సోమన్‌పల్లి పాఠశాలలో 2026 వరకు భవనాన్ని పూర్తి చేసి రాష్ట్రంలో మొట్టమొదట అడ్మిషన్లు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లా పాలనాధికారి కోయ శ్రీహర్ష, మంథని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమా తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో బోధనే లక్ష్యం : పొన్నం

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం కులం, మతం పేరు మీద గురుకులాలు ఏర్పాటు చేసిందని.. వాటికి అతీతంగా అంతర్జాతీయ స్థాయిలో విద్యనందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమీకృత గురుకులాలను నిర్మించబోతున్నట్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల పరిధిలోని యాదవులపల్లిలో శుక్రవారం ఆయన కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం 10 ఏళ్లలో చేసినవి తాము 10 నెలల్లో చేసి చూపించామన్నారు. అర్హత ఉండి రుణమాఫీ కాకపోతే అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక అసమానతలు విద్యతోనే తొలగుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, నాయకులు రమణారెడ్డి, ఎస్ఎల్ గౌడ్, శ్రీనివాస రావు, రాము, లక్ష్మారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే కవ్వంపల్లి తదితరులు

బస్సు డ్రైవర్‌కు మూర్ఛ.. అప్రమత్తతతో తప్పిన ముప్పు

కరీంనగర్ రవాణా విభాగం, న్యూస్‌టుడే: బస్సు చోదకుడికి మూర్ఛ రావడంతో అప్రమత్తమైన ఆయన బస్సును ఆపేసిన ఘటన కరీంనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. రాజన్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు (నాన్‌స్టాప్) కరీంనగర్ బస్టాండ్ నుంచి సిరిసిల్లకు వెళ్తుండగా గీతా భవన్ చౌరస్తాలో డ్రైవర్‌కు మూర్ఛ వచ్చింది. అప్రమత్తమైన ఆయన ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం డ్రైవర్‌ను 108కు ఫోన్ చేసి ఆసుపత్రికి తరలించారు. అందులో మరో డ్రైవర్ ఉండటంతో అతను బస్సును తిరిగి కరీంనగర్ బస్టాండ్ వరకు తీసుకెళ్లారు. ఈ ఘటన సమయంలో బస్సులో 20 మంది వరకు ఉన్నారని, వారంత సురక్షితంగా ఉన్నారని ఏటీఎం గుండా సురేశ్ తెలిపారు. డ్రైవర్ క్షేమంగానే ఉన్నారన్నారు.

అనర్హుల గుర్తింపు.. 5,819 పేర్ల తొలగింపు

ప్రతి నెలా డీలర్ల వారీగా వివరాలు సేకరణ ■ రేషన్ కార్డుకు ఈ-కేవైసీ తప్పనిసరి

న్యూస్‌టుడే, హుజూరాబాద్


ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్‌కార్డుల్లోంచి అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది. మరణించిన వారు, వివాహం జరిగి అత్తారింటికి వెళ్లిన వారు, స్థానికంగా లేని వారికి బియ్యం పంపిణీ నిలిపి వేయాల్సిందిగా పౌరసరఫరాల శాఖ ఆదేశించింది. ప్రతి నెలా డీలర్ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తూ అనర్హులను గుర్తిస్తున్నారు. పక్కదారి పడుతున్న రేషన్ బియ్యాన్ని కట్టడి చేసేందుకే అనర్హులకు బియ్యం పంపిణీ నిలిపి వేసేలా ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది.

■ ఉమ్మడి జిల్లాలో గత ఫిబ్రవరిలో 9,78,595 రేషన్ కార్డులు ఉండగా 28,13,951 మంది లబ్ధిదారులు ఉన్నారు.

■ అదే అక్టోబరు వచ్చే సరికి 9,77,409 రేషన్ కార్డుల్లో 28,08,132 మంది లబ్ధిదారులున్నారు. ■ తొమ్మిది నెలల వ్యవధిలోనే 1,186 రేషన్ కార్డులను రద్దు చేసి 5,819 మంది లబ్ధిదారుల పేర్లు తొలగించారు. ■ కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 1,075 రేషన్‌కార్డులు రద్దు చేసి 4,192 మంది పేర్లు తొలగించారు. జగిత్యాలలో 787, పెద్దపల్లిలో 406, రాజన్న సిరిసిల్లలో 434 మంది పేర్లు తొలగించారు. ■ ప్రతి నెలా రేషన్ డీలర్ల వారీగా నివేదికలు తెప్పించుకుంటున్న పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యుల్లో మరణించిన వారు, స్థానికంగా లేని వారిని గుర్తించి వారి పేర్లను తొలగిస్తున్నారు. ■ తొలగించిన వారిలో కొందరు అర్హులు ఉన్నట్లు ఆరోపణలు వస్తుండగా, అలాంటిదేమీ లేదని అధికారులు చెబుతున్నారు. ■ అనర్హుల పేర్లు తొలగించిన పౌరసరఫరాల శాఖ ఈ నెలలో 31.721 మెట్రిక్ టన్నుల బియ్యం తక్కువ చేసి కేటాయించారు.

తొమ్మిది నెలల్లో వ్యత్యాసం ఇలా..

	ఫిబ్రవరి		అక్టోబరు	
జిల్లా	కార్డులు	లబ్ధిదారులు	కార్డులు	లబ్ధిదారులు
కరీంనగర్	2,77,993	8,08,916	2,76,918	8,04,724
జగిత్యాల	3,07,158	8,82,495	3,07,100	8,81,708
పెద్దపల్లి	2,19,677	6,25,090	2,19,663	6,24,684
సిరిసిల్ల	1,73,767	4,97,450	1,73,728	4,97,016



3,46,884 మంది ఈ-కేవైసీకి దూరం

అర్హులకే బియ్యం అందేలా ప్రభుత్వం ఈ-కేవైసీని తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఏదైనా కుటుంబంలో ఒక లబ్ధిదారుడు ఈ-కేవైసీ ప్రక్రియ చేయకుంటే వారి పేర్లను రేషన్ కార్డుల్లోంచి తొలగించేలా నిబంధన విధించింది. ఇందుకోసం గత నెల 30 వరకు విధించిన గడువును ప్రభుత్వం డిసెంబరు 31 వరకు పొడిగించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 28,08,132 లబ్ధిదారులుండగా ఇప్పటి వరకు 24,61,248 మంది మాత్రమే ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ నవీకరణ లేకపోవడం, చనిపోయిన వారి పేర్లు తొలగించకపోవడం, పెళ్లైన యువతులు అత్తారింటికి వెళ్లిపోవడం, కొంత మంది ఉన్నత చదువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం, ఉద్యోగులు స్థానికంగా ఉండకపోవడం తదితర కారణాలతో 3,46,884 మంది ఈ-కేవైసీకి దూరంగా ఉన్నారు. డిసెంబరు 31 లోపు రేషన్ కార్డుల్లో పేరు ఉన్న ప్రతి లబ్ధిదారుడు డీలర్లను సంప్రదించి ఈ-కేవైసీ ద్వారా వివరాలు నమోదు చేయించుకోవాలని, లేని పక్షంలో బియ్యంతోపాటు ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించే విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని కరీంనగర్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగరావు స్పష్టం చేశారు.



వార్డుల వారీగా వివరాలు

మీ చేతిలోనే ఓటరు జాబితా

సిరిసిల్ల పట్టణం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం ఓటరు జాబితా తయారు చేసింది. వార్డుల వారీగా ఓటర్ల వివరాలతో సిద్ధం చేసింది. గత నెలలో ముసాయిదా విడుదల కాగా అభ్యంతరాల స్వీకరణ తర్వాత సెప్టెంబర్ 28న తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది.

చరవాణిలో చూడొచ్చు...

సాధారణ పౌరులు సైతం ఓటరు జాబితాను చూసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇందుకోసం చరవాణి లేదా కంప్యూటర్‌లో గూగుల్ ద్వారా tsec.gov.in అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఫైనల్ రోల్స్ జీపీ అనే మరో ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ వివరాలు ఎంచుకోవాలి. గ్రామానికి సంబంధించిన ఓటర్ల వివరాలు వార్డుల వారీగా కనిపిస్తాయి. ఏ వార్డులో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, అందులో మహిళలు, పురుషుల సంఖ్య కనిపిస్తుంది. పక్కనే తెలుగు, ఆంగ్ల భాషలో జాబితా పూర్తి వివరాలతో ప్రత్యక్షమవుతుంది.

అయిదు రోజుల్లో అక్కడక్కడ వర్షాలు

జగిత్యాల వ్యవసాయం : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాగల అయిదు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడతాయని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 23-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32-34 డిగ్రీల సెల్సియస్ వద్ద, గాలిలో తేమ 65-93 శాతం వరకు నమోదు అవుతుందని చెప్పారు.

విజయదశమి శుభాకాంక్షలు

కరీంనగర్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ దుర్గాభవానీ అమ్మవారి ఆశీర్వాదంతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో ఈ సంవత్సరం ప్రారంభించే అన్ని పనుల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే - కాల్వశ్రీరాంపూర్

? కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం ప్రాథమిక పాఠశాలలో నూతన భవనం నిర్మాణం కోసం ప్రహరీని తొలగించారు. మళ్లీ నిర్మించాలి. - అశోక్

✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - మహేశ్, ఎంఈవో, కాల్వశ్రీరాంపూర్

గోమాతకు ప్రత్యేక పూజలు


ఓదెలలో గోవుకు పూజలు చేస్తున్న భక్తులు

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెల మండల కేంద్రంలోని ఒర్రెగడ్డలోని మల్లికార్జున యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి మండపం వద్ద 9వ రోజు ప్రత్యేక పూజలు చేశారు. గోరక్షణ సమితి ఆధ్వర్యంలో గోమాతకు గోపూజ నిర్వహించి గోవుకు అభిషేకం చేసి పట్టు వస్త్రాలు సమర్పించి గోప్రదక్షణ చేశారు. సమస్త దేవతలకు నిలయమైన గోవును పూజిస్తే పాపాలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో అర్చకులు సాయికుమార్, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

జూలపల్లి: మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన దీకొండ మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మహేశ్‌తో కలిసి 2003-24లో పదో తరగతి చదివిన బాల్యమిత్రులు రూ. 40,000ను సుకన్య యోజన పథకం కింద ఫిక్స్‌డ్ డిపాసిట్ చేసి సంబంధిత పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాజా మాజీ ఉప సర్పంచి కొప్పుల మహేశ్, సతీశ్, శ్రీనివాస్, సంతోశ్, స్వామి, చిన్న నాటి మిత్రులు కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో జమ్మిమొక్క నాటుతాం


మాట్లాడుతున్న చందర్

గోదావరిఖని: దసరా సందర్భంగా ప్రతి గ్రామం, డివిజన్‌లో ఒక జమ్మిమొక్క నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, భారాస జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా నాయకులు జోగినపల్లి సంతోష్‌రావు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

ముగిసిన బతుకమ్మ సంబరాలు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ సంబరాలు కాలనీలో శుక్రవారం తెల్లవారుజాము వరకు జరిగాయి. సింగరేణి ఆర్జీ-2 యాజమాన్యం కాలనీ-పోతనకాలనీ ప్రధాన మార్గంలోని జల్లారం వాగువద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్ వద్ద మహిళలు బతుకమ్మ నిమజ్జనం చేశారు.


బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న స్థానికులు

యంత్రాల పనితీరుపై ఆందోళన

తగ్గుతున్న పని గంటలు

న్యూస్‌టుడే, గోదావరిఖని

ఆశించిన స్థాయిలో యంత్రాల పని గంటలు పెంచుకోకపోవడంతో సింగరేణి ఆర్థికంగా నష్టపోతుంది. తద్వారా బొగ్గు ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరకు అమ్మడంతో భారీ మొత్తంలో నష్టం ఏర్పడుతుంది. విద్యుత్తు ప్రాజెక్టుల ద్వారానే సంస్థ కొంతవరకు నిలదొక్కుకోగలుగుతుంది. దీని వల్ల భవిష్యత్తులో సింగరేణి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయని స్వయంగా సీఎండీ వెల్లడించడం గమనార్హం.

ఉపరితల గనుల్లో అదే పరిస్థితి

సింగరేణిలో 80 శాతం బొగ్గు ఉత్పత్తిని వెలికితీసే ఉపరితల గనుల్లోనూ యంత్రాల



పనితీరుపై యాజమాన్యం అసంతృప్తి వ్యక్తం చేస్తుంది. డంపర్లు, డోజర్లు, షావెల్ యంత్రాలతోపాటు డ్రాగ్‌లైన్ ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. సింగరేణి వ్యాప్తంగా 18 ఉపరితల గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తున్న సంస్థ యంత్రాల పనితీరు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఉపరితల గనుల్లో పనిచేసే యంత్రాలను రోజుకు 20 గంటలు వినియోగించాలి. కానీ కేవలం 12 గంటల కంటే ఎక్కువ పనిచేయడం లేదని యాజమానం గుర్తించింది.

కోల్ ఇండియా వైపే మొగ్గు..

గత ఆర్థిక సంవత్సరం భారీ మొత్తంలో లాభాలు గడించినట్లు ప్రకటించినా.. అందులో విద్యుత్తు కేంద్రాల ద్వారా వచ్చిన ఆదాయంతోపాటు బాండ్ల ద్వారా లభించిన వడ్డీ డబ్బులతోనే అధిక మొత్తంలో ఆర్థికంగా బలపడినట్లు కనిపిస్తుంది. సింగరేణి ఏటా 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్నా.. బయటి మార్కెట్‌తో పోటీ పడలేకపోతుంది. కోల్ ఇండియా తక్కువ ధరకు బొగ్గు విక్రయిస్తుండటంతో వినియోగదారులు అటువైపే మొగ్గు చూపుతున్నారు.

విద్యుత్తు కేంద్రాలే రక్ష..

సింగరేణికి ప్రస్తుతం విద్యుత్తు కేంద్రాల ద్వారానే ఆదాయం సమకూరుతుంది. సంస్థ 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాలతోపాటు 287 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను నిర్వహిస్తుంది. దీంతో

టన్నుకు రూ.6 వేల నష్టం

భూగర్భ గనుల్లో ఉత్పత్తయ్యే బొగ్గుకు భారీ మొత్తంలో నష్టం వాటిల్లుతుంది. ఒక టన్ను బొగ్గు ఉత్పత్తి చేయడానికి సుమారుగా రూ.10 వేల వరకు ఖర్చు వస్తుంది. దీన్ని బయట విక్రయిస్తే టన్ను బొగ్గుకు రూ.4 వేలు. అంటే రూ.6 వేల వరకు నష్టం వస్తుంది. సాధారణంగా ఒక ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రం రోజుకు కనీసం 14 గంటలు పనిచేయాలి. కానీ సింగరేణిలో కేవలం 7 నుంచి 8 గంటలు మాత్రమే పని చేస్తున్నాయి. కోట్ల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో దానికి వెచ్చించిన ఆదాయంతోపాటు ఉత్పత్తి తక్కువగా రావడంతో సంస్థ నష్టపోతుంది.



పాటు మరో 20 మెగావాట్ల జలాశయాలపై సోలార్ పలకలను ఏర్పాటుచేసి విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది. వీటిద్వారా సంస్థకు గతేడాది రూ.500 కోట్ల లాభాలు వచ్చాయి. దీంతో రానున్న కాలంలో గ్రీన్ హైడ్రో, సోలార్, థర్మల్, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పేందుకు ప్రణాళికలు చేసుకుంది. వీటి ద్వారా సంస్థ మనుగడను కాపాడుకోవాలని భావిస్తుంది.

సంస్థ స్థితిగతులపై ఆరా

గోదావరిఖని: మల్టీ డిపార్టుమెంటు కమిటీ శుక్రవారం జీడీకే-2 గనిని సందర్శించింది. కార్యక్రమానికి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ హాజరై సంస్థ స్థితిగతులపై మాట్లాడారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని చేపట్టి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితులు, బొగ్గు ఉత్పత్తి వివరాలను తెరపై ప్రదర్శించారు. అధికారులు రామ్మోహన్, ఆంజనేయులు, సాయిప్రసాద్, రమేశ్, రవీందర్, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

గోదావరిఖని: సింగరేణి జీడీకే-11 గనిపై నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ శుక్రవారం చండీహోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్మికులకు ఏర్పాటుచేసిన ప్రసాదాన్ని వడ్డించారు. ఆయన వెంట జీఎం లలిత్‌కుమార్, గని ఏజెంటు శ్రీనివాస్, ఇతర అధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణపై జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్జీ-1 గనుల వృత్తి శిక్షణ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ హాజరై మాట్లాడారు. రెండు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలు, వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఈనెల 14న హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులో పంపిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కిరణ్‌బాబు, ఫౌండేషన్ ప్రతినిధి జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం


కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: రామగుండం-3 ఏరియాలో శుక్రవారం ఓసీపీ-1, ఓసీపీ-2, సీహెచ్‌పీ, కమ్యూనిటీలో నిర్వహించిన 'ఉజ్వల సింగరేణి- ఉద్యోగుల పాత్ర' కార్యక్రమానికి ఏర్పాట్లు చేసి విజయవంతం చేసిన అధికారులను ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకర్‌రావు తన కార్యాలయంలో సన్మానించారు. నోడల్ అధికారి, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఇన్‌ఛార్జి ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, సీహెచ్‌పీ డీజీఎం కాశీ విశ్వేశ్వరరావు, పర్సనల్ విభాగాధిపతి సుదర్శనాన్ని అభినందించారు.

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): అడ్రియాలా లాంగ్‌వాల్ ప్రాజెక్టులో 'ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర' కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రాంచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ప్రాజెక్టు అధికార కొలిపాక నాగేశ్వరరావు, ఐఈడీ డీజీఎం చంద్రశేఖర్, మేనేజర్ జనార్దన్, పర్సనల్ విభాగాధిపతి పాల్గొన్నారు.


మంథని: గాంధీచౌక్‌లో దుర్గామాత వద్ద మంత్రి శ్రీధర్‌బాబు


పెద్దపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు పూజలు


కమాన్‌పూర్‌లో మహిషాసురమర్దిని రూపంలో అమ్మవారు


మంథని పట్టణంలో..


ఖని: కాళికామాత రూపంలో..

వైభవంగా దేవి నవరాత్రోత్సవాలు


మార్కండేయకాలనీ: చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఆధ్యాత్మికం వెల్లివిరిసింది. ఆయా మండపాల్లో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావులు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జూలపల్లి మండలం అబ్బాపూర్‌లో అనసూర్య - రాజిరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

\- న్యూస్‌టుడే, యంత్రాంగం


కాల్వశ్రీరాంపూర్: మొట్లపల్లిలో..

వైభవంగా వేంకటేశ్వరస్వామికి క్షీరాభిషేకం

ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహాక్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విప్ లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించి చండీ హోమంలో పాల్గొన్నారు. ఈ ఉత్సవం ద్వారా దేవస్థానానికి రూ. 13,21,1336 ఆదాయం సమకూరింది. ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేర వార్తలు

చెరువులో పడి గేదెలకాపరి మృతి

● గట్టెపల్లిలో పండగపూట విషాదం


బుజేందర్

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలో పండగపూట విషాదం నెలకొంది. ఎస్సై శ్రావణ్‌కుమార్, బాధిత కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిలుక బుజేందర్ (38) నీరుకుళ్లలో గేదెల కాపరిగా పని చేసేవారు. ఈ నెల 9న గేదెలను తోలుకెళ్లి తిరిగి రాలేదు. గేదెలు స్థానిక పొలాల్లో మేత మేస్తున్నాయని తెలుసుకున్న యజమాని తిరుపతిరావు వాటిని ఇంటికి తోలుకెళ్లారు. బుజేందర్ కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం గట్టెపల్లి శివారులోని ఊరకుంట వద్ద చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు బుజేందర్ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెరువులోకి వెళ్లిన గేదెలను బయటకు తీసుకొచ్చే క్రమంలో బుజేందర్ కాళ్లకు గుర్రపుడెక్క చుట్టుకొని, ఈతరాక నీటమునిగి మృతిచెందినట్లు భావిస్తున్నారు. బుజేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ''ఇంటికి రాగానే కొత్త దుస్తులు కొనిస్తానని చెప్పి వెళ్లిపోయావా నాన్నా.. ఇప్పుడు మాకు కొత్త దుస్తులు ఎవరు కొనిస్తార''ని పిల్లలు రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ ప్లాంటులోని యూనిట్-7 సీఎస్‌పీలో పనిచేస్తున్న ముజాహిద్‌కు రోడ్డు ప్రమాదంలో శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర గాయాలయ్యాయి. ప్లాంటులో విధులు పూర్తిచేసుకుని తెల్లవారుజామున తిరిగి ఇంటికివచ్చే క్రమంలో లేబర్ గేటు సమీపంలో వాహనం ఢీకొంది. దీంతో సహచర కార్మికులు ఆసుపత్రికి తరలించారు.

యువకుడికి...

ముత్తారం: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గాదార్ల హరీశ్‌గౌడ్ శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తూ ముత్తారం మండలం మచ్చుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై అదుపుతప్పి కింద పడిపోయారు. అతడికి తీవ్ర గాయాలు అవడంతో స్థానికులు 108 ద్వారా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు.

బస్టాండ్‌లో బంగారు ఆభరణాల చోరీ

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: కరీంనగర్ బస్టాండ్‌లో శుక్రవారం ఓ మహిళకు చెందిన 6 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. కరీంనగర్ ఒకటో ఠాణా ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన ప్రకారం... ధర్మారం మండలానికి చెందిన వెల్పుల మమత శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైంది. ధర్మారం నుంచి ఆటోలో కరీంనగర్‌కు వచ్చింది. కరీంనగర్ బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సెక్కి కూర్చొని సంచి చూసుకుంది. సంచి జిప్ తెరిచి ఉండటంతో అనుమానంతో లోపల చూస్తే బంగారు ఆభరణాల డబ్బా కనిపించలేదు. ఒకటో ఠాణా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బస్టాండ్‌కు వచ్చి సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ మహిళ బాధితురాలి బంగారు ఆభరణాలు, రూ.3 వేల నగదు అపహరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కమాన్‌పూర్ మండలం జూలపల్లిలోని శారద విద్యానికేతన్ హై స్కూల్‌లో 2004-05లో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం సమ్మేళనం నిర్వహించారు. రామగిరి మండలం కల్వచర్లలో జరిగిన ఈ కార్యక్రమంలో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

నిల్వ నీటితో వాహనదారులకు అవస్థలు



మల్యాలపల్లి గ్రామ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై నీరు నిలిచి వాహదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరిఖని నుంచి కరీంనగర్ వెళ్లే రాజీవ్ రహదారిపై వర్షపు నీరు నిలిచి ఉండటంతో ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతున్నాయని చోదకులు వాపోతున్నారు. ఈ మార్గం గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతాయి. వర్షం కురిసినప్పుడల్లా అండర్ బ్రిడ్జిపై నుంచి వచ్చే నీరు రోడ్డుపైకి చేరుతుంది.

\- న్యూస్‌టుడే, పాలకుర్తి (రామగుండం)

చురుకుగా దసరా ఏర్పాట్లు

గోదావరిఖని, న్యూస్‌టుడే: స్థానిక సింగరేణి జవహర్‌లాల్‌నెహ్రూ క్రీడా మైదానంలో నిర్వహించనున్న దసరా వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను సింగరేణి యాజమాన్యం చేపడుతుంది. రావణ దహనానికి సంబంధించి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. బాణసంచా కాకుండా వేదికతోపాటు బుల్లితెర హాస్య నటులతో కార్యక్రమాలు, స్థానిక కళాకారులతో నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో దసరా పండగ సందర్భంగా ఓడేడు మాజీ సర్పంచి బక్కారావు ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఓడేడు గ్రామంలోని అయిదు సీనియర్ జట్లు, నాలుగు జూనియర్ జట్లు పాల్గొన్నాయి. విజయం సాధించిన జట్లకు బహుమతులు అందజేశారు. ఓడేడు మాజీ సర్పంచి సిరికొండ బక్కారావు, మాజీ ఉప సర్పంచి భానుకుమార్, శేరు స్వామి తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో మాజీ సర్పంచి బక్కారావు

■ క్రీడాకారిణికి చేయూత

మంథని గ్రామీణం: మంథని మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామంలో కావేరి జ్యోతికి శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు రూ.లక్ష విలువ గల చెక్కు అందజేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి.. చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయింది. కృత్రిమ కాలుతో నడుస్తూ, ప్రస్తుతం హనుమకొండలో డిగ్రీ చదువుతున్న ఆమె క్రీడల్లో రాణిస్తోంది. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీలో పాల్గొనాల్సి ఉంది. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే ఉండటంతో.. మంత్రి దృష్టికి రాగా రూ.లక్ష సాయం అందజేశారు.

■ మంత్రి పరామర్శ

ముత్తారం: ముత్తారం మండలంలో ఇటీవల పలువురు మృతిచెందగా.. బాధిత కుటుంబాలను మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం పరామర్శించారు. పీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

■ గాయపడిన వ్యక్తికి రక్తదానం

యైటింక్లయిన్‌కాలనీ: కరీంనగర్‌కు చెందిన సుధాకర్‌రెడ్డికి చికిత్స నిమిత్తం రక్తం కావాల్సి ఉండడంతో.. కాలనీకి చెందిన వసుంధర విజ్ఞాన వికాస మండలి సభ్యులు రక్తదానం చేశారు. ఇటీవల సుధాకర్‌రెడ్డికి ప్రమాదంలో రెండు కాళ్లు విరగడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ కోసం శుక్రవారం రక్తం అవసరం ఉండడంతో కాలనీకి చెందిన కట్కూరి శంకర్, పీఆర్ శ్రీనివాస్‌లు రక్తదానం చేశారు.

■ నర్సరీ పనుల పరిశీలన

పాలకుర్తి(అంతర్గాం): మండలంలోని ఎల్లంపల్లిలో ఎంపీడీవో అలీ శుక్రవారం పర్యటించారు. నర్సరీ మొక్కల పెంపకం, కమ్యూనిటీ ప్లాంటేషన్ పనులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ ఏపీవో రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ ఉద్యోగం సాధించిన యువతికి సన్మానం

ధర్మారం: ఇటీవల డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో ప్రతిభచాటి ఎస్జీటీగా ఎంపికైన మల్లాపురానికి చెందిన పోకల కావ్యను బంజరుపల్లి తండాకు చెందిన భాస్కర్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. మల్లాపూర్‌లోని పత్తిపాక రహదారి కూడలి వద్ద కావ్య-వినయ్ కుటుంబం హోటల్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. నర్సింహరెడ్డి, శ్రీనివాస్, బాలునాయక్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.